ఆదివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 37.0°C | కనిష్ఠం : 24.0°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.34 గం..
సహర్ : మంగళవారం ఉ : 4.54 గం..



మాటలు తప్ప.. మూటలు లేవు!

గత ప్రభుత్వ పాలనలో ఆగమైన దళితులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను ఆశల పల్లకిలో ఊరేగించింది. దళితబంధు పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆర్భాటంగా ప్రకటించి అప్పటికే అమలులో ఉన్న 'ఎస్సీ యాక్షన్ ప్లాన్'కు మంగళం పాడింది. తద్వారా యాక్షన్‌ప్లాన్‌లో భాగమైన భూమి కొనుగోలు పథకం కూడా నిలిచిపోయింది. తీరా చూస్తే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకం ఆ పార్టీ కార్యకర్తలకు ఫలహారం అయింది. కనీసం ఊరికి ఒక్కరికి కూడా అర్హులకు అందలేదు. ఫలితంగా నిరుపేద ఎస్సీలు ఏ పథకానికీ నోచుకోలేదు. రెంటికి చెడ్డ రేవడిలా ఆగమైపోయారు.

- పత్తా లేని ఎస్సీ యాక్షన్ ప్లాన్
- మూడేళ్లుగా దిక్కులేని వార్షిక ప్రణాళిక
- ఎటూకాకుండా పోయిన 'దళితబంధు'
- 'నిలిచిన భూమి కొనుగోలు' పథకం

జనగామ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పేద ఎస్సీలకు రాయితీపై రుణాలు అందించి జీవనోపాధి కల్పించే 'ఎస్సీ యాక్షన్ ప్లాన్' మూడేళ్లుగా అమలు కావడం లేదు. పేదలకు బ్యాంకులు, నేరుగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించే లక్ష్యంతో ఎస్సీ కార్పొరేషన్ ఏటా 'ఎస్సీ వార్షిక ప్రణాళిక'ను ప్రకటించేది. బ్యాంకు లింకేజీ లేకుండా కొన్ని పథకాలు, బ్యాంకు లింకేజీతో కొన్ని పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేది. వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు గానూ ఏటా కొంత మేర నిధులను కేటాయించేది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో చివరి సారిగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వార్షిక ప్రణాళికను విడుదల చేసింది. 2020-21లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.500 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను అమలు చేయగా.. ఆ తర్వాత మూడేళ్లుగా ఈ యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు నోచుకోవడం లేదు. ఆ తర్వాత దళితబంధు పథకం అమలు చేస్తున్నామంటూ 2021లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ రూపకల్పనకు మంగళం పాడింది. అయితే దళితబంధు ద్వారా కొందరికి మాత్రమే లబ్ధి జరగగా మెజారిటీ పేద ఎస్సీలు ఈ ఆర్థిక భరోసా పథకానికి నోచుకోలేకపోయారు. దీనికన్నా కనీసం ఏటా యాక్షన్ ప్లాన్‌ను రూపొందిస్తే అర్హులైన ఎస్సీలందరికీ జీవనోపాధి కోసం రుణాలు అందించే అవకాశం ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏంటీ ఎస్సీ యాక్షన్ ప్లాన్..

యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రెండు విధాలుగా అంటే బ్యాంక్ లింకేజీతో, బ్యాంక్ లింకేజీ లేకుండా జీవనోపాధి పథకాలను అందస్తారు. ఏటా యాక్షన్ ప్లాన్ విడుదల చేయగా ఆసక్తి కలిగిన నిరుపేదలు దరఖాస్తులు చేసుకుంటారు. వీరిలో అర్హులైన వారిని ఎంపిక చేసి యాక్షన్ కిందకు వచ్చే పథకాలను వారికి వర్తింపజేస్తారు. బ్యాంకు లింకేజీ పథకాలకు సంబంధించి రుణాన్ని మంజూరు చేయడం కోసం సంబంధిత బ్యాంకులకు పంపించి రుణాలు ఇప్పిస్తారు. ఈ రుణాలతో స్వయం ఉపాధికి సంబంధించి వాహనాల కొనుగోలు, సాగు పరికరాలు, యంత్రాల కొనుగోలు, డెయిరీ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు లాంటి తదితర పథకాలను ప్రభుత్వం అందించే వీలుంది. దీంతో పాటు బ్యాంక్ లింకేజీ కింద ఎస్సీల్లోని నిరుపేదలకు మూడెకరాల వరకు భూమి కొనుగోలు చేసి ఇవ్వడం యాక్షన్ ప్లాన్‌లో భాగం. అంతేకాకుండా సొంతంగా భూమి కలిగి ఉన్న ఎస్సీల భూముల్లో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించడం చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆసక్తి ఉన్న యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను కూడా అందిస్తుంటారు.

'దళితబంధు' పేరుతో పక్కకు..

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 'దళితబంధు' పథకాన్ని తీసుకువచ్చి ఏటా ప్రకటించాల్సిన యాక్షన్ ప్లాన్‌కు మంగళం పాడింది. పేద ఎస్సీల్లో ఆర్థికాభివృద్ధి పేరుతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 ఆగస్టు 5న దళితబంధు పథకాన్ని తీసుకొచ్చింది. మొదటి విడతగా నియోజకవర్గానికి 1,500 కుటుంబాలకు చొప్పున కుటుంబానికి రూ.10లక్షల చొప్పున అందిస్తామని ప్రకటించింది. కానీ.. నియోజకవర్గానికి 100 కుటుంబాల చొప్పున మాత్రమే అందించింది. అదికూడా బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇవ్వడంతో గ్రామాల్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఫలితంగా ఈ పథకంపై దళితుల నుంచే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కాగా.. ఎప్పటిలాగే యాక్షన్ ప్లాన్ విడుదల చేసి దాని కిందకు వచ్చే పథకాలను అమలు చేస్తే మెజారిటీ పేదలకు లబ్ధి జరుగుతుందంటున్న దళితులు.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిలిచిన ఎస్సీ యాక్షన్ ప్లాన్‌కు మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

నిలిచిన భూమి కొనుగోలు పథకం

ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలు చేయకపోవడంతో ఈ కార్యక్రమంలో ప్రధానమైన 'భూమి కొనుగోలు పథకం(ల్యాండ్ పర్చేస్ స్కీం)' కూడా నిలిచిపోయింది. యాక్షన్ ప్లాన్‌లోనే భాగంగానే ప్రభుత్వం ల్యాండ్ పర్చేస్ స్కీంను అమలు చేస్తుంటుంది. భూమి లేని నిరుపేద ఎస్సీలకు మూడెకరాల వరకు భూమిని కొనుగోలు చేసి వారికి అందిస్తుంది. దీంతో పాటు భూమిని అభివృద్ధి చేయడం, ఏడాది పాటు పంట సాగుకు పెట్టుబడిసాయం చేయడం, ఎల్‌పీఎస్ కింద ఇచ్చిన భూములకు నీటి వసతి కల్పించడం, బోరుబావులను తవ్వించడం, విద్యుత్ సౌకర్యం కల్పించడం లాంటివి ఎల్‌పీఎస్ కిందకు వస్తాయి. కానీ.. నాలుగేళ్లుగా ఈ యాక్షన్ ప్లాన్ అమలు చేయకపోవడంతో ఏళ్లుగా అమలవుతూ వస్తున్న 'ల్యాండ్ పర్చేస్ స్కీం' కూడా ఆగిపోయింది.

'అరూరి'కే ఖరారు

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా రమేష్

- ఐదో జాబితాలో ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం
- ఎట్టకేలకు ఉత్కంఠకు తెర



హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని కలిసిన అరూరి రమేశ్

బయోడేటా

పేరు	అరూరి రమేశ్
తండ్రి	గట్టుమల్లు
తల్లి	వెంకటమ్మ
భార్య	కవితకుమారి
విద్యాభ్యాసం	ఎంఏ ఎల్ఎల్‌బీ, సోషియాలజీ
పిల్లలు	కుమారుడు విశాల్, కుమార్తె అక్షిత
కులం	మాదిగ
స్వగ్రామం	జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్ గ్రామం
జన్మదినం	04-04-1967

హనుమకొండ టౌన్, మార్చి 24: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిత్వంపై నెల కొన్న ఉత్కంఠకు తెరపడింది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఇటీవలే బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. బీజేపీ వరంగల్ లోక్‌సభ టికెట్ కోసం అర డజను మందికి పైగా ఆశావహులు ప్రయత్నాలు చేశారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పరకాల మునిసిపల్ చైర్మన్ రాజభద్రయ్య, బీజేపీ సీనియర్ నేతలు చింత సాంబమూర్తి, మాజీ మంత్రి గుండె విజయరామారావులతో పాటు మాజీ డీజీపీ టి.కృష్ణప్రసాద్ తదితరులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు ఆరూరికే కమలనాథులు మొగ్గుచూశారు. కాగా, వరంగల్ ఎంపీ సీటుకు బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థులను ఖరారు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి తేలలేదు.

వరంగల్ లోక్‌సభ సీటుపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. బీజేపీకి మద్దతు ఇస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో బీజేపీ పెద్దలు సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో బీజేపీలో చేరేందుకు అరూరి రమేష్ సముఖత వ్యక్తం చేశారు. అయితే అరూరి బీజేపీలోకి వెళ్లకుండా బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఒకదశలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసేందుకు రమేష్ ప్రెస్‌మీట్ పెడితే.. అదే రోజు బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, బస్వరాజు సారయ్య, నాగుర్ల వెంకన్న తదితరులు రమేష్‌ను బలవంతంగా హైదరాబాద్‌కు తీసుకెళ్లి కేసీఆర్‌తో సమావేశం నిర్వహించారు. వరంగల్ ఎంపీ టికెట్ రమేష్‌కు ఇచ్చేందుకు కేసీఆర్ అంగీకరించినప్పటికీ పోటీకి అరూరి సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో వెంటనే కడియం కావ్య పేరును అధిష్ఠానం ప్రకటించింది. దీంతో పార్టీ మారటంపై అరూరి కొంత తర్జనభర్జనల తరువాత బీజేపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఈనెల 17న కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం జిల్లాలో బీజేపీ ముఖ్యులను కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. అనుకున్నట్లుగానే ఆదివారం ఐదో జాబితాలో

మిగతా 8వ పేజీలో



రైతులపై బీఆర్ఎస్ నాయకుల మొసలి కన్నీరు

మాట్లాడుతున్న జాటోతు రామచంద్రునాయక్, మామిడాల యశస్వినిరెడ్డి

- వారు ఉన్నప్పుడు కాల్వలు తవ్విన దాఖలాలు లేవు
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు సత్తాచాటాలి
- ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పెద్దవంగర, మార్చి 24 : రైతులపై బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి విమర్శించారు. ఆదివారం రెడ్డికుంట తండా శివారులోని సర్పంచ్‌తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి చెన్నూరు రిజర్వాయర్ వరకు ఆనాడు రైతులు బాగుండాలని కాలువలు తవ్వించింది కాంగ్రెస్ ప్రభుత్వమే..! కానీ, కమిషన్లకు కక్కుర్తి పడి పదేళ్ల చెన్నూరు రిజర్వాయర్‌ను ఓపెన్ చేయకుండా రైతులను ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిసి, ముందే కాళేశ్వరం గేట్లను ఎత్తివేసి నీటిని గోదావరి పాలు చేసిన బీఆర్ఎస్ ప్రబుద్ధులు, సన్నాసులు మీరు కాదా! అని ప్రశ్నించారు. పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఏ ఒక్కకాల్వ కూడా తవ్విన దాఖలాలులేవని ఆరోపించారు.

బీఆర్ఎస్ నాయకులు జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో చింతబాయి తండాలో ఫొటోలకు ఫోజులిస్తూ, రైతుల కోసం మొసలికన్నీరు కారవడం విడ్డూరంగా ఉందని రామచంద్రునాయక్, యశస్వినిరెడ్డి అన్నారు. మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఒక్కటి అడుగుతున్నాం.. ప్రేమఉంటే పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రిజర్వాయర్ పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజాక్షేత్రంలో చెప్పాలని డిమాండ్ చేశారు. బూత్‌స్థాయి నుంచి పటిష్ఠం చేస్తూ త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 14స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలవబోతున్నదని, పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మాజీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, జాటోత్ నెహ్రూనాయక్, అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, సోమరాజ శేఖర్, సోమయ్య, శ్యామ్ సుందర్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, సైదులు, హరికృష్ణ, రాజు యాదవ్, జగ్గానాయక్, కార్యకర్తలు ఉన్నారు.

అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెస్

- రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు మొండిచేయి
- గోదావరిలో నీళ్లున్నా కూడా వదలకుండా నిర్లక్ష్యం
- ఆరు గ్యారెంటీల్లో ఒక్కటికూడా అమలు చేయలేదు
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



చింతబాయితండాలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

దేవరుప్పుల, మర్చి 24: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిందని, వందరోజుల పాలనలో ఆరు గ్యారెంటీలు అంటూ నేడు మొండి చేయి చూపిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం ఆయన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో నీళ్ల రాక బోర్లకు నీరు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు హరీశ్‌రావుతో ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలను చూపించి కన్నీటి పర్యంతమయ్యారు. మూడు నెలల్లో శివశంకర్ అనే రైతు 6బోర్లు, సత్తమ్మ 4బోర్లు, నర్సింహ 3బోర్లు, జంకు 9బోర్లు, లక్ష్మీ 6బోర్లు, విజయ 4బోర్లు వేసినా నీళ్ల పడలేదని వివరించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో గ్రామాల్లోని చెరువులు, కుంటలను కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలతో నింపడం వల్ల తమ పంటపొలాలు పారేవని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చుక్క నీరు కూడా వదలకపోవటంతో పంటలు ఎండిపోయి, పెట్టుబడులు మీదపడి అప్పులపాలు అయ్యామని తండాకు చెందిన రైతులు శివశంకర్, ఆంగోతు సత్తెమ్మ తదితర రైతులు హరీశ్‌రావుతో మొరపెట్టుకున్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ 100 రోజుల పాలనలో 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. రైతులను ఆదుకోవటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. గోదావరి నదిలో నీళ్లఉన్నాకూడా రైతులకు అందించడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆరుగ్యారెంటీల్లో రైతులకోసం చెప్పిన ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ నాయకులు అమలు చేయలేదన్నారు. డిసెంబర్ 9న రైతులకు రూ. 2లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రైతుబంధు రూ.15వేలు ఇస్తామని నమ్మబలికి, కనీసం పాత రూ.10వేలు కూడా ఇవ్వడం లేదన్నారు. కౌలు రైతులకు కూడా రైతుబంధు ఇస్తామని చెప్పి మాట తప్పారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాలువల్లో పుష్కలంగా నీళ్ల పారాయని, రైతులు రెండు పంటలు పండించుకుని సంతోషంగా ఉండేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక నీళ్లలేవు, కరెంటు లేదని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, వడ్లకు రూ. 500బోనస్ ఇచ్చి కొనాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశం, చింత రవి, కొల్లూరు సోమయ్య, హన్మంతు, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా చక్రస్నానం

బుగులు వెంకన్న ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



దేవతామూర్తులకు చక్రస్నానం చేయిస్తున్న పూజారులు

బతుకమ్మ కుంటలో హోలీ వేడుకలకు ఏర్పాట్లు

జనగామ కల్చరల్, మార్చి 24: వసంత రుతువు ఆగమనంతో ఆకులు రాలి కొమ్మలు చిగుర్లు వేస్తుండగా, నిండా పూలతో హరితవనాలు పూదోటలుగా మారిన వేళ వసంతాల హోలీ పర్వదినాన్ని జనగామ జిల్లాలో సోమవారం జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. అక్కా - చెల్లి, బావా - మరదలు, అన్నా - తమ్ముడు, భార్యా - భర్తలు అనే వావి వరుసలు లేకుండా ఉత్సాహంతో నిండా రంగులు జల్లుకుంటూ ఆడుకునే హోలీ పండుగను ప్రజలు ఎంతగానో ఆదరిస్తారు. సోమవారం జరుపుకునే హోలీ పండుగకు బతుకమ్మ కుంటలో ఏర్పాట్లు చేసినట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి తెలిపారు. ఉదయం 6 గం.ల నుంచి 11 గం.ల వరకు సంప్రదాయబద్ధంగా, డీజే పాటలతో జరిపేందుకు ఏర్పాట్లు చేశామని, పట్టణవాసులు ఈ వేడుకల్లో పాలు పంచుకోవాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పుర ప్రముఖులు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు..

హోలీ రోజున అయ్యప్ప స్వామి పుట్టిన రోజుమ హోత్సవాన్ని పురస్కరించుకొని బాణాపురం అయ్య ప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు కాసోజు రాజేశ్వరాచార్యులు తెలిపారు. ఉదయం 5 గ.లకు మహాగణపతి హోమం, 6.15 గం.లకు అష్టాదశాభిషేకం, 7.15 గం.లకు విశేష అలంకరణ, సహస్ర పుష్పార్చన, 9 గం.లకు పడిపూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



వేసవిలో తిరుగులేని పంట

అధిక ఆదాయాన్నిస్తున్న పుచ్చ సాగు ● జిల్లాలో 100 ఎకరాల్లో పండిస్తున్న రైతులు



పాలకుర్తి మండలం శాతాపురంలో పుచ్చసాగు చేస్తున్న రైతు శ్రీనివాస్

పాలకుర్తి, మార్చి 24 : వేసవి వచ్చిందంటే పుచ్చ పంటకు మంచి డిమాండ్ ఉంటుంది. మండు వేడివి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. సాధారణంగా డిసెంబర్ మూడో వారం నుంచి జనవరి రెండో వారం వరకు పుచ్చను వేసుకోవచ్చు. ఇప్పుడు విత్తుకున్నా మే నెలాఖరువరకు కాయలు చేతికి అందుతాయి. ప్రస్తుతం సీజన్‌తో సంబంధం లేకుండా యేడాది పొడవునా ఈ పంట పండిస్తున్నారు. వ్యవసాయ నిపుణుల సూచనలు, సలహాలు మేరకు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడిని సాధించి లాభాలు గడించొచ్చు. జిల్లాలో మొత్తం 100 ఎకరాల్లో రైతులు పుచ్చ పంటను సాగు చేస్తున్నారు. గత ఏడాది కేవలం 82 ఎకరాల్లో సాగు చేశారు. పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన మాంకాళి శ్రీనివాస్, సురేష్‌తో పాటు ఇదే మండలం శాతాపురం గ్రామానికి చెందిన గన్న శ్రీనివాస్, దేవరుప్పుల మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన మెరుగు రమేష్ తలో రెండెకరాల చొప్పున పుచ్చతోటను సాగు చేస్తున్నారు. వీరు గతంలో జొన్న, మొక్కజొన్న, వేరు శనగ, పత్తి, పెసర పంటలను సాగు చేసేవారు. వాతవరణంలో వచ్చిన మార్పులు, తెగుళ్లతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది. దీంతో గత ఐదు సంవత్సరాల నుంచి ఈ పంటను సాగు చేస్తున్నారు. విత్తనాలను హైదరాబాద్, జనగామ, వరంగల్ జిల్లాలలోని ఫర్టిలైజర్ల షాపుల్లో కొనుగోలు చేసి అక్టోబర్ చివరి వారంలో విత్తారు. విత్తనాలు ఎరువులు, సస్యరక్షణ, కూలీలకు ఎకరానికి రూ. 30 వేల చొప్పున రెండెకరాలకు రూ. 60 వేలు ఖర్చు చేశారు. ఎకరాకు సుమారు ఎనిమిది నుంచి పది టన్నుల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో టన్నుకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు ధర పలుకుతోంది. విత్తనాలు వేసినప్పటి నుంచి సుమారు 90 రోజులు అంటే మూడు నెలల్లో కాయలు కోతకు వస్తాయి. హైదరాబాద్, మహారాష్ట్ర, బెంగళూరు లాంటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. స్థానిక మార్కెట్లల్లో కూడా విక్రయిస్తుంటారు.

యజమాన్య పద్ధతులు..

పుచ్చ విత్తనాలు నాటే ముందు చెలకలో ఎరువు చల్లుకోవాలి. ఎకరాకు 3 నుంచి 4 ట్రాక్టర్ల కుళ్లిన ఎరువు, 3 నుంచి 5 బ్యాగుల వేప చెక్కపిండి, 3 నుంచి 5 బ్యాగుల ఆముదం చెక్క, ఒక బస్తా ఆగ్రోమిన్ సాయిల్, మైక్రోఫుడ్ సాయిల్, 50 కిలోల బస్తా సీఎంఎస్ (క్యాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్) వినియోగించాలి. రసం పీల్చే పురుగు, తెగుళ్ల నివారణకు కాయలు లావుగా పెరిగేందుకు మందులు పిచికారి చేయాలి.

రెండేళ్లుగా సాగు చేస్తున్నాను..

మెరుగు రమేష్, రాంచంద్రాపురం



రెండేళ్ల నుంచి పుచ్చతోట సాగు చేస్తున్నాను. మిగితా పంటల కంటే పుచ్చసాగులో లాభాలు బాగానే ఉన్నాయి. మొక్కజొన్న, పత్తి, వేరు శనగ పంటలతో పాటు ఈ పంటను కూడా సాగు చేస్తున్నాను. వాటికంటే పుచ్చసాగులోనే లాభాలు ఎక్కువగా వస్తున్నాయి. హైదరాబాద్ నుంచి కూడా వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మిగతా సీజన్‌లో అంతగా దిగుబడి రాదు. ధర కూడా తక్కువే ఉంటుంది. వేసవిలో సాటు చేస్తేనే అన్ని విధాలుగా మేలు.

మల్చి సాగు చేస్తే సబ్సిడీ వస్తుంది..

కేఆర్ లత, జిల్లా ఉద్యావన శాఖాధికారి



జిల్లాలో పుచ్చకాయ సాగుపై ఇప్పుడిప్పుడే రైతులు ఉత్సాహం చూపుతున్నారు. లాభాలు బాగా వస్తుండడంతో ఆసక్తి చూపుతున్నారు. కాని పంటను కోతుల బెడద నుంచి కాపాడుకోవడం పెద్ద సమస్య. ఇందుకోసం సోలార్, లేదా షేడ్ నెట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఈ ఏడాది జిల్లాలో 100 ఎకరాలు సాగు చేశారు. ముందుముందు ఇంకా పెరుగుతుందని ఆశిస్తున్నాం.



ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ సుమన్‌కు పురస్కారం



పురస్కార ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న డాక్టర్ సుమన్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.సుమన్‌కు హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 2023-24 విద్యాసంవత్సరానికి గాను అకడమీషియన్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ 51వ వార్షిక అవార్డుల కార్యక్రమంలో డాక్టర్ సుమన్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, విశిష్ట అతిథులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జేబీ రావు, డీఆర్‌డీవో జనరల్ మేనేజర్ రాజాబాబు హాజరయ్యారు. కాగా, అసోసి యేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా డాక్టర్ సుమన్ పురస్కార ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ ప్రాంతంలోనే ప్రముఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అవార్డును అందుకున్న డాక్టర్ సుమన్‌ను ఎస్సార్ వర్సిటీ వీసీ దీపక్, రిజిస్ట్రార్ అర్చనరెడ్డి, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

25 కోడెలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, మార్చి 24: అనుమానాస్పదంగా డీసీఎంలో తరలిస్తున్న 25 కోడెలను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం కోదాడ నుంచి పెద్దపల్లికి డీసీఎంలో 25 కోడెలను నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా ఓఆర్ఆర్‌పై పోలీసులు పట్టుకున్నారు. ఏడు మాత్రమే డీసీఎంలో తరలించాల్సి ఉండగా, 25 కోడెలను తరలిస్తుండటంతో అనుమానం వచ్చి పట్టుకున్నారు.

తరలిస్తున్న నలుగురు వ్యక్తులనుంచి సరైన సమాధానం రాకపోవడంతో కోడెలను ముప్పారంలోని బృందావన్ గోశాలకు తరలించారు. నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని కేయూ ఎస్ఐ దేవేందర్ ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యాసంగి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

- ఏప్రిల్ మూడోవారం నుంచి కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1078 కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం దిగుబడి 14.13 లక్షల మెట్రిక్ టన్నులు
- అందుబాటులో చాలినన్ని గన్నీ బ్యాగులు
- కమీషన్ చెల్లింపులో జాప్యం.. 22 కోట్ల బకాయిలు



ధాన్యం సేకరణ కేంద్రం

హనుమకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి)ఉమ్మడి వరంగల్ జిల్లాలో యాసంగి (రబీ) సీజన్ ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయి. ఈ సీజన్ 9.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందు కోసం 1078 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ఉమ్మడి జిల్లాలో ఈ సారి యాసంగిలో 9,18,337.59 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 14,13,454 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు అధికారులు పూనుకుంటున్నారు.

మొదలుకానున్న కోతలు

ఉమ్మడి జిల్లాలో మరో 15 రోజుల్లో యాసంగి వరి కోతలు ప్రారంభం కానున్నాయి. గతేడాది సెప్టెంబరులో పంటలు వేసిన రైతులు వరికోతలకు సిద్ధమవుతున్నారు. డిసెంబరు, జనవరి నెలల్లో నాట్లు వేసిన రైతులకు మరో నెల రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. జిల్లాలో వరి కోతలు ప్రారంభమైతే పెద్ద ఎత్తున మార్కెట్‌కు ధాన్యం వచ్చే అవకాశం ఉంటుంది. ఏటా రైతులు పౌరసరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయం చేస్తారు. ఇప్పటి నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు చేస్తేనే వరి కోతలు వచ్చే సరికి అవి అందుబా టులోకి వస్తాయి. లేకుంటే రైతులు గతేడాదిలా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకా శం ఉంది. కాగా ఈ యాసంగిలో రైతులు పెద్ద ఎత్తున వరిని సాగు చేయగా సాగునీటి సరఫరా, భూగర్భ జలాలు అడుగ ంటిపోవడంతో పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల నీటి తడులు లేక పొలాలు నెర్రెలుబారాయి. కొందరు మధ్యలోనే పంటను వదిలేస్తున్నారు. దీనికితోడు వడగల్లు, అకాల వర్షాల బెడద కూడా పొంచి ఉంది. ఈ నేపథ్యంలో త్వరగా కోతలు ప్రారంభించి వెంటనే ధాన్యాన్ని విక్రయించాలని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యం క్వింటాకు రూ. 2203, కామన్ ధాన్యానికి క్వింటా రూ. 2183 మద్దతు ధరను ప్రకటించింది.

ఇతరులు కనిపించొద్దు..

రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లు, ఇతరత్రా ప్రైవేటు వ్యక్తులెవరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనిపించకుండా తగిన జాగ్రతలు తీసుకోవల సింది గా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ధాన్యం సేకరణ సిబ్బందికి అప్పుడే ఆదేశాలు జారీ చేశారు. అప్పులు వడ్డీ భారం దృష్ట్యా సకాలంలో సీఎంఆర్ డెలివరీ, బకాయిల రికవరీ జరిగేలా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

గన్నీ బ్యాగులు..

ధాన్యం సేకరణలో గన్నీ బ్యాగుల పాత్ర కీలకం. చాలినన్ని గన్నీ బ్యాగులు లేకుంటే దాని ప్రభావం సేకరణపై పడుతుంది. ఈ దృష్ట్యా సేకరణ ప్రారంభానికి ముందే అన్ని జిల్లాల్లో గన్నీ బ్యాగులు చాలినంత మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని జిల్లాలో అప్పటికే అవసరమైనన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచారు. ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం కాగానే వీటిని ఆయా కేంద్రాల ఇండెంట్‌ను బట్టి సరఫరా చేస్తారు. గత యాసంగి సీజన్ కన్నా ఈ సారి ధాన్యం దిగుబడులు పెద్దగా పెరిగే అవకాశాలు లేనందు వల్ల ప్రస్తుతం ఉన్న బ్యాగులు సరిపోతా యని అధికారులు చెబుతున్నారు.

కమిషన్ బకాయిలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పౌరసరాలశాఖ కమిషన్‌ను వెంట వెంటనే చెల్లించకపోవడంతో బకాయిలు రూ. కోట్లలో పేరుకు పోతున్నాయి. ప్రస్తుతం మూడు సీజన్ల బకాయిలు కేంద్రాలకు రావలసి ఉన్నది. సుమారు ఒక్కో జిల్లాకు రూ. 3 నుంచి రూ. 4 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఉ మ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 20 కోట్ల మేరకు బకాయిలు ఉన్నట్టు అంచనా. దీంతో ఐకేపీ, పీఏసీఎస్ అధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై గత కొద్ది రోజులుగా ఒత్తిడి తెస్తున్నాయి. తమకు కమిషన్ బకాయలు చెల్లిస్తే తప్పా ఈ సారి కేంద్రాలను తెరవమని హెచ్చరించాయి. దీనితో ధాన్యం కొనుగోళ్ళ ప్రారంభం కావడానికి ముందు మార్చి చివరి వారంలో బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

సౌకర్యాలు..

కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను పౌరసరఫరాల శాఖ అధికారులు కల్పిస్తున్నారు. రైతులు అమ్మకానికి కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షాల వల్ల తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను సిద్ధం చేస్తున్నారు. ధాన్యం తూకం త్వరిత గతిన జరిగేందుకు వీలుగా చాలినన్ని తూకం యంత్రాలను, ధాన్యం తేమను కొలిచే పరికరాలను కూడా చాలినన్ని సమకూరుస్తున్నారు. వీటితో పాటు కొనుగోలు చేసిన ధాన్యా న్ని మిల్లులకు చేరవేసేందుకు అవసరమైన లారీలను కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలతో ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఈసారి కొత్తగా టెండర్లు పిలిచే అవకాశం లేనందు వల్ల గత లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లనే ఈ సీజన్‌లో కొనసాగించనున్నట్టు తెలుస్తోంది.

జిల్లాల వారీగా ..

- వరంగల్ జిల్లాలో రబీలో ధాన్యం కొనుగోలుకు 208 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఈ సారి 1,10,70540 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగయింది. ధాన్యం దిగుబడి 2,55,429.18 మె.ట ఉండవచ్చునని అంచనా వేశారు. 1.50 లక్షల మెట్రిక్ టన్నులు మేరకు కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు.
- హనుమకొండ జిల్లాలో 150 కేంద్రాల ద్వారా 1.61 లక్షల మె.ట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో 1,18,061.06 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ మేరకు 3,16,231.57 మె.ట. ధాన్యం దిగుబడి రావచ్చునని అంచనా.
- జనగామ జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు 195 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటి ద్వారా 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సీజన్‌లో 4,33,289.87 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ మేరకు 4,03,468.30 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాలో ధాన్యం సేకరణకు ఈ సారి 192 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 1.70 లక్షల మె.ట ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో 128516.57 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2,52,766.60 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా వేస్తున్నారు.
- ములుగు జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాల ద్వారా 85 వేల మె.ట ధాన్యం సేకరించనున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 46979.40 ఎకరాల్లో వరి సాగు చేశారు. 10477547 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.20 లక్షల మెట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో ఈ సారి 80,785.29 ఎకరాల్లో వరి సాగుకాగా దిగుబడి 209976 మెట కావచ్చునని భావిస్తున్నారు.

మహిళపై యువకుడి దాడి

హనుమకొండ టౌన్, మార్చి24: తెల్లవారుజామున ఓ యువకుడు ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ నానా హంగామా చేశాడు. అడ్డుకోబోయిన తల్లిపై కర్రతో దాడిచేసిన సంఘటన హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమార్‌పల్లిలో చోటుచేసుకుంది. కాజీపేటకు చెందిన మల్యాల రమేశ్ అనే యువకుడు.. ఈ నెల 19న ఉదయం 6 గంటల ప్రాంతంలో కుమార్‌పల్లిలోని ఓ మహిళ ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ ఇళ్లంతా గాలించాడు. ఈలోగా మహిళ పోలీసులకు ఫోన్‌చేయడానికి ప్రయత్నిస్తుండగా కర్రతో మహిళ ముఖంపై బలంగా కొట్టగా ముఖంపై గాయాలయ్యాయి. ఆ తర్వాత యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత మహిళ కె.మాధవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు ఇవ్వడం లేదంటూ సొంతింటికే నిప్పు

ఇంట్లో సామగ్రి దహనం



నాగారంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తదితరులు

నెక్కొండ, మార్చి 24: చేసిన అప్పులు తీర్చడానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని కోపంతో కుమారుడు ఏకంగా ఇంటికే నిప్పుపెట్టిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... వ్యవసాయ కూలీలు కుమ్మరి వెంకన్న-ఐలమ్మ దంపతుల కుమారుడు మధు పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఐదేళ్ల క్రితం మధు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. వ్యక్తిగత అవసరాలకు మధు రూ.1.50లక్షల వరకు అప్పుచేశాడు. అప్పు తీర్చడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను నెల రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం కుటుంబంతో మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లిలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చాడు. అక్కడి మధు తల్లిదండ్రులు కూడా వచ్చారు. అక్కడ కూడా డబ్బుల విషయంలో తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. అదే రోజు రాత్రి మధు ఒంటరిగా నాగారంలోని ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీసి ఇల్లంత చల్లి నిప్పుపెట్టాడు. మంటలు వ్యాపించడంతో స్థానికులు వచ్చి మంటల్ని ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న బట్టలు, వంట సామగ్రి, తలుపులు, కిటికీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో కారణంగా రూ.50వేల వరకు ఆస్తినష్టం వాటింది. విషయం తెలుసుకున్న ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకొని మధును అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై మధు తల్లిదండ్రులు, బంధువుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

సుధాకర్‌రావు సేవలు మరువలేనివి

సంతాప సభలో పాల్గొన్న మాజీ మంత్రులు, ప్రభుత్వవీప్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు



సుధాకర్‌రావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు

పెద్దవంగర, మార్చి 24 : పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ వైద్య ఆరోగ్యశ్రీ ట్రస్టు మాజీ ఛైర్మన్ డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్ రావు (74) నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు అందించిన సేవలు మరవలేనివని మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, ప్రభుత్వ వీప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్విని, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం వడ్డెకొత్తపల్లిలో సుధాకర్‌రావు నివాసంలో ఏర్పాటు సంతాప సభలో పాల్గొని, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సబ్బండ వర్గాల అభ్యున్నతికి, నియోజకవర్గ అభివృద్ధితో పాటు రైతుల కష్టాలు తీర్చడానికి శ్రీరాంసాగర్ కాలువద్వారా చెరువులు నింపడానికి కృషి చేశారని గుర్తు చేశారు. నిత్యం కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుండేవారని, విద్యార్థి దశలోనే తెలంగాణ ఉద్యమంలో పనిచేసి సామాన్య, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో సేవ కార్యక్రమాలు, వైద్య సేవలందించారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో సుధాకర్‌రావు విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి చేస్తామని తెలిపారు. సంతాప సభలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ జీసీసీ గాంధీ నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎంపీపీ ఆంజయ్య, జడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, నాయకులు నవీన్, ఐలయ్య, సుధీర్, సీతారాములు, జాటోతు నెహ్రూనాయక్, హరిప్రసాద్, ముత్తినేని శ్రీనివాస్, కుమార్, కుటుంబ సభ్యులు, పలు ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్‌లో నిబంధనలకు తూట్లు

తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్



క్యాంపు అధికారి గోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం క్యాంపుల్లో అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంత సేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీనియారిటిని అతిక్రమించి అధికారులు డ్యూటీలు ఇస్తున్నారని, 10 నుంచి 20 యేళ్ల అనుభం ఉన్న ప్రైవేటు లెక్చరర్లకు క్యాంపుల్లో ఏటేలుగానే విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీటేలుగా అవకాశం ఇవ్వకుండా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. పైస్థాయి విధుల్లో పనిచేస్తున్న కొంతమంది అధ్యాపకులకు ఎన్నిలకు డ్యూటీలు పడినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఒకేసారి డబుల్ డ్యూటీలు చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్‌లోనే ఆర్జేడీ కార్యాలయాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం క్యాంపు అధికారి ఎ.గోపాల్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

కాంట్రాక్టర్ గుప్పిట్లోనే సింథటిక్ ట్రాక్

- డీఎస్‌ఏకు అందుబాటులోకి రాని జేఎన్ఎస్ ట్రాక్
- నిర్మాణమై రెండున్నరేళ్లయినా అప్పగింతలో జాప్యం
- కంప్లీషన్ లెటర్ ఇచ్చి ఆర్నెళ్లు
- అయినా పట్టించుకోని పీఆర్ శాఖ



డీఎస్‌ఏకు అప్పగించని హనుమకొండ జేఎన్ఎస్ లోని అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్

వరంగల్ స్పోర్ట్స్, మార్చి24: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్మించిన అథ్లెటిక్స్ సింథటిక్‌ట్రాక్ పనులు పూర్తయి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇంకా కాంట్రాక్టర్ గుప్పిట్లోనే ఉంది. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నేటి వరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్ఏ)కు అప్పగించక పోవటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా..

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఖేలో ఇండియా పథకం ద్వారా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగి, అత్యాధునిక హంగులతో సింథటిక్‌ట్రాక్‌ను మంజూరు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధమాన అథ్లెట్లకు జాతీయ, అంతర్జాతీయస్థాయి శిక్షణతో పాటు మెరికల్లాంటి క్రీడాకారులకు వేదికగా నిలిచేందుకు సుమారు రూ.7కోట్ల నిధులతో 400 మీటర్ల, 8లైన్లతో కూడిన అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్‌ను కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ట్రాక్ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంతో ఆ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) వీసీ, ఎం.డి. పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్‌తో ఒప్పందం కుదుర్చుకొని పీఆర్ శాఖ 2019 ఆగస్టు నెలలో ట్రాక్ నిర్మాణ పనుల కోసం టెండర్లను ఆహ్వానించింది. ఢిల్లీకి చెందిన శివనరేష్ అనే సంస్థ పనులు దక్కించుకుంది. సింథటిక్‌ట్రాక్‌తో పాటు క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా భవనం నిర్మించాలనే ఒప్పందంతో 2020 మార్చి నెలలో పనులు ప్రారంభించింది. అయితే ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ.. కాంట్రాక్టర్ 2021 సెప్టెంబరు నెలలో ట్రాక్ పనులు పూర్తి చేశామని చెప్పినప్పటికీ సింథటిక్‌ట్రాక్ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ ప్రత్యేక అనుమతితో ఇదే యేడు సెప్టెంబరు నెల 15నుంచి 19వరకు జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నూతనంగా నిర్మించిన అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్‌పై లాంఛనంగా కొనసాగాయి. జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు కాంట్రాక్టర్ నేతృత్వంలో జరగడం, ట్రాక్ పనులు మొదలు పెట్టిన 9నెలలు వ్యవధిలో పనులు పూర్తి చేసి ట్రాక్ అప్పగించకపోవడంతో డీఎస్ఏ అధికారులు ట్రాక్‌ను అప్పగించడానికి కంప్లీషన్ రిపోర్టు ఇవ్వాలని పీఆర్ శాఖకు లేఖ రాశారు. సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్ విభాగం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండగా, ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా రెండేళ్ల అనంతరం సర్టిఫికెట్‌ను డీఎస్ఏకు పంపించారు. దీంతో డీఎస్ఏ అధికారులు పీఆర్ శాఖ ఇచ్చిన లేఖను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) టెక్నికల్ విభాగానికి పంపించడంతో సంబంధిత అధికారులు సింథటిక్‌ట్రాక్‌ను సందర్శించారు. అయితే ఇందులో కొన్ని లోపాలున్నాయని తేల్చారు. సింథటిక్‌ట్రాక్‌లో ఉన్న లోపాలను కాంట్రాక్టర్ ద్వారా సరిచేసి ట్రాక్‌ను అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని పీఆర్‌శాఖకు ఆరు నెలల కిందట డీఎస్ఏ అధికారులు లేఖ పంపినప్పటికీ ఇప్పటివరకు పీఆర్‌శాఖ అధికారులు కానీ, సదురు నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్ స్పందించకపోవడం దురదృష్టకరమని క్రీడాభిమానులు వాపోతున్నారు.

అంతే కాకుండా ఇటీవల డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ద్వారా కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ వర్చువల్ పద్ధతిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులు సమక్షంలో ప్రారంభించారు. సాక్ష్యాత్తు కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ సాయ్, సాట్ స్పోర్ట్స్ అధికారుల సమక్షంలో ట్రాక్‌ను ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణిని వీడకుండా ట్రాక్‌ను అప్పగించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ట్రాక్ నిర్మాణ పనులకు రూ.7కోట్లకు గాను రూ.3.50కోట్ల చెల్లింపులు మాత్రమే జరిగాయని, మిగతా డబ్బులు రావాలని కాంట్రాక్టర్ చెబుతున్నప్పటికీ.. దీనికి ట్రాక్ అప్పగించడానికి సంబంధం లేదని పలువురు అంటున్నారు. ట్రాక్ అప్పగించడానికి అభ్యంతరాలు ఉండకూడదనే పీఆర్‌శాఖ అధికారులు కంప్లీషన్ లేఖను డీఎస్ఏ అధికారులకు ఇచ్చారంటున్నారు. అయితే ట్రాక్ నిర్మాణం పూర్తయి రెండున్నరేళ్ల ఏళ్లు గడిచిన్నా ట్రాక్‌ను ఎందుకు అప్పగించడం లేదని పీఆర్‌శాఖ.. సాట్ అధికారులను వివరణ కోరారు. అయితే ట్రాక్ మధ్యలో చిన్న లోపాలున్నాయని, వాటిని సరిచేయించడంలో జాప్యం జరుగుతోందని, త్వరలోనే డీఎస్ఏకు ట్రాక్‌ను అప్పగించేలా చూస్తామని చెప్పడం కొసమెరుపు.

ఆర్నెళ్ల కిందటే కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు..

- అశోక్‌కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి హనుమకొండ

సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులు ట్రాక్‌ను తనిఖీ ఆర్నెళ్ల కిందటే డీఎస్ఏకు కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులకు కంప్లీషన్ లెటర్‌ను పంపించారు. ట్రాక్‌ను సందర్శించి లోపాలున్నాయని గుర్తించారు. కాంట్రాక్టర్ ట్రాక్‌పై ఉన్న లోపాలను పరిష్కరించే విధంగా పీఆర్‌శాఖ చర్యలు చేపట్టి త్వరితగతిన ట్రాక్‌ను డీఎస్ఏకు అప్పగించాలని ఆర్నెళ్ల కిందటే సాట్ అధికారులు లేఖ రాసినప్పటికీ నేటివరకు పీఆర్‌శాఖ అధికారులు స్పందించడం లేదు.

నోరూరిస్తున్న హలీమ్, హరీస్

- వరంగల్ త్రినగరిలో జోరుగా అమ్మకాలు
- 200లకు పైగా విక్రయ కేంద్రాలు
- ఆసక్తిగా తింటున్న ప్రజలు



కొత్తూరు జెండా ప్రాంతంలో హలీమ్, హరీస్‌లను వండుతున్న మాస్టర్



హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీ వద్ద హరీస్, హలీమ్‌లను వండుతున్న మాస్టర్లు

వడ్డెపల్లి, మార్చి 24: రంజాన్ మాసం హలీమ్, హరీస్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఉపవాస దీక్షలతో శుష్కించిన శరీరానికి బలవర్ధకమైన అల్పాహారంగా వీటిని తీసుకుంటారు. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం పూర్తయ్యాక ముస్లింలు హలీమ్, హరీస్ తింటారు. వరంగల్ నగరంలోని మండిబజార్, హనుమకొండలోని న్యూ రాయపుర, అశోక హోటల్ ప్రాంతం, సుబేదారి, కలెక్టరేట్‌తోపాటు కాజీపేట రైల్వే జంక్షన్ ఏరియాల్లో వీటి విక్రయాలు రంజాన్ మాసంలో ప్రతీ రోజు సాయంత్రం జోరుగా సాగుతున్నాయి.

తయారీ విధానం ఇలా..

ప్రధానంగా గొర్రె, మేక మాంసంతో తయారుచేసే దాన్ని హలీమ్ అంటారు. చికెన్‌తో చేసే వంటకాన్ని హరీస్ అని పిలుస్తారు. హోటళ్ల ముందు ఇటుకలతో తయారు చేసిన బట్టీలతో నిర్మించిన బట్టీలపై కట్టెలతో మంట పెడుతూ వీటిని వండుతారు. మాస్టర్లు తొలుత మాంసాన్ని శుభ్రం చేస్తారు. ఆ తర్వాత కాజు, బాదం, కిస్మిస్, పిస్తా, మునఖా, అంజీర్ వంటి దినుసులు కలిపి నీటిలో చాలా సేపు ఉడికిస్తారు. తర్వాత నానబెట్టిన గోధుమ రవ్వ , స్వచ్ఛమైన నేతిలో పాలు, పెరుగు పోసి మరో రెండు గంటల పాటు ఉడికించి తెడ్లతో బాగా కలియబెడుతారు. మెత్తగా ఉడికిన తర్వాత సాయంత్రం వేడిగా ఉన్న హలీమ్, హరీస్‌లను సిద్ధంగా పెడతారు. వీటిని గరిటెతో తీసి కప్పుల్లోకి తీసి కొత్తిమీర, పుదీన, నిమ్మకాయ ముక్క, కీర దోస, క్యారెట్‌తో పాటు కోడి గుడ్డును సైతం అలంకరించి హలీమ్, హరీస్‌తో పాటు సూప్‌ను వడ్డిస్తారు. నగర వాసులంతా వీటిని తినడానికి ఇష్టపడుతారు.

చారిత్రక నేపథ్యం..

హలీమ్ వంటకానికి శతాబ్దాల చరిత్ర ఉంది. సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాల్లో ప్రథమంగా ప్రారంభమైన హలీమ్ కాలక్రమేపి విశ్వవ్యాప్తిలోకి వచ్చిం ది. తొలుత హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో ఈ వంటకం పరిచయమైంది. ఒకప్పుడు చాలా మంది వరంగల్ నగర వాసులు హలీమ్, హరీస్ తినేందుకు హైదరాబాద్‌కు వెళ్లేచ్చేవారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం వరంగల్ హలీమ్, హరీస్ బట్టీలు వెలిశాయి. తొలుత హైదరాబాద్‌కు చెందిన మాస్టర్లే వరంగల్‌కు వచ్చి హలీమ్, హరీస్ వండేవారు. క్రమేపీ వరంగల్‌కు చెందిన మాస్టర్లు సైతం ఈ వంటకాల తయారీపై పట్టు సాధించారు. వరంగల్ త్రినగరికి చెందిన వారందరికీ రుచికరమైన హలీమ్, హరీస్‌ను అందిస్తున్నారు. నోరూరించే విధంగా రుచికరమైన ఈ వంటకాలను తినడానికి నగర వాసులంతా ఎంతో మక్కువ కనబరుస్తున్నారు. ముస్లింలే కాక ఇతరులు సైతం వీటిని తినడానికి ఎంతో ఇష్టపడుతున్నారు.

దిల్‌షాద్ హోటల్‌లో తొలిసారి..

ప్రప్రథమంగా వరంగల్ నగరంలోని మండిబజార్ (దిల్‌షాద్ హోటల్)లో హలీమ్, హరీస్‌ను వండి నగర ప్రజలకు పరిచయం చేశారు. ఒకప్పుడు హనుమకొండ సుబేదారి, కాజీపేట, నయీంనగర్‌లోని ముస్లింలు మండి బజార్‌కు వచ్చి హలీమ్, హరీస్‌లను తినేవారు. ఆ తర్వాత హనుమకొండలోని కోహినూర్ హోటల్, సుబేదారిలోని మునవర్ హోటల్‌లో హలీమ్, హరీస్ వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం వరంగల్ త్రినగరిలో సుమారు 200 లకు పైగా హలీమ్, హరీస్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. మెర్క్యూరి లైట్లతో విక్రయ కేంద్రాలను శోభాయమానంగా అలంకరించడంతో వినియోగదారులు ఇష్టంగా తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

- అమ్మకాలు బాగున్నాయి..

- ఎంఏ లతీఫ్, సుబేదారి బడేమసీద్..



రంజాన్ మాసం కాబట్టి ఇఫ్తార్ తర్వాత ముస్లింలు ఎక్కువగా హలీమ్, హరీస్‌ను తినడానికి రావడంతో అమ్మకాలు బాగానే ఉన్నాయి. ముస్లింలతో పాటు ఇతరులు కూడా వీటిని తినడానికి ఇష్టపడటంతో హాట్ కేకుల్లా అమ్మకాలు సాగుతున్నాయి. హలీమ్ ప్లేట్ ధర రూ. 200, హరీస్ ప్లేట్ ధర రూ. 120 పలుకుతుంది.

కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దు

మాజీ మంత్రి హరీశ్‌రావు భరోసా



దేవరుప్పులలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన మాజీ మంత్రులు, ఎమ్మెల్యే

దేవరుప్పుల, మార్చి 24: కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని, అన్ని వేళలా అందుబాటులో ఉండి అందరినీ ఆదుకుంటామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. ఆదివారం దేవరుప్పులలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయనతో పాటు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు పెట్టాలని చూస్తోందన్నారు. మహాలక్ష్మీ పథకంలో మహిళలకు రూ.2500ఇస్తామని, నిరుద్యోగ యువతకు రూ.4వేలు ఇస్తామని మోసం చేసిందన్నారు. రైతుబంధు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఇవన్నీ ఇచ్చాకనే పార్లమెంటులో ఓటు అడగాలని డిమాండ్ చేశారు. నాలుగు వేల పింఛన్ ఇచ్చేదాక, రూ.2లక్షలు రుణమాఫీతో పాటు ఎకరానికి రూ.25వేల పరిహారం ఇచ్చేదాక పోరాడుతామన్నారు. అసెంబ్లీలో తాము పోరాడుతామని, ఇక్కడ ప్రజల పక్షాన మీరు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, కొల్లూరు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్లలో ఘన స్వాగతం..

కొడకండ్ల: ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.సుధాకర్‌రావు దశ దిన కర్మకు హాజరవడానికి వెళ్తున్న మాజీ మంత్రులకు కొడకండ్లలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, బీఆర్‌ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు మహబూబాబాద్ జిల్లా వడ్డెకొత్తపెల్లికి మొండ్రాయి మీదుగా వెళ్తుండగా మొండ్రాయి క్రాస్ రోడ్డు వద్ద స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి.ఎ.గాంధీ నాయక్, మహేష్, వీరన్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప పండుగను వైభవంగా నిర్వహిస్తాం



కేశిరెడ్డిపల్లిలో జల్లి కడువలతో తరలివస్తున్న కురుమ కుల పెద్దలు

బచ్చన్నపేట, మార్చి 24: మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామంలో వచ్చే నెలలో నిర్వహించే బీరప్ప-కామరతి కల్యాణ ఉత్సవాలను వైభవంగా జరుపుతామని కురుమ సంఘం కుల పెద్దలు తెలిపారు. ఆదివారం జల్లి కడువలతో ఇంటింటికీ తరలివచ్చి ఆలయం వద్ద పాలు, నీళ్లు, నెయ్యి పోసి పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తుల కల్యాణ పత్రికను రాశారు. ఏప్రిల్ 29న కల్యాణం జరుపాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కనకయ్య, నర్సింహులు, మల్లయ్య, అయ్యాలం, రాజయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్, పర్శరాములు, బీరయ్య, రాములు, ప్రశాంత్ పాల్గొన్నారు.

హామీలు తప్ప అభివృద్ధి శూన్యం

- ఆచరణకు నోచుకోని పరిశ్రమల ఏర్పాటు
- ఉద్యోగాలు లేక యువత నైరాశ్యం
- దశాబ్దాలు గడిచినా అభివృద్ధి అంతంతే..
- దీనస్థితిలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 24: ఎప్పుడో 1957లో ఏర్పాటైన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం జనరల్ స్థానంగా ఉండేది. 1972లో ఎస్సీలకు రిజర్వ్ అయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వాలు, పాలకులు, ఎమ్మెల్యేలు ఎందరో మారారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంగా మారి 8 ఏళ్లవుతున్నది. కాని ఉపాధి విషయంలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల విషయంలో ఎంతో కొంత పురోగతి సాధించినా ఇప్పటి వరకు ప్రజలకు స్వయం ఉపాధి కల్పించే ఒక్క పరిశ్రమ స్థాపన జరిగిన దాఖలాలు లేవు. వ్యవసాయాధారిత పరిశ్రమ గాని, ఉత్పత్తి ఆధారిత పరిశ్రమ గాని లేవు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన రవాణా వ్యవస్థ ఉంది. రైల్వేస్టేషన్, బస్టాండ్ ఉన్నా పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు ముందుకు పడలేదు. ఈ విషయంలో పాలకులు ఇచ్చే హామీలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు పనులు, ఉపాధి కోసం పట్టణాల బాట పట్టడం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్నది.

కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్‌టైల్ పార్కు ఏది?

స్టేషన్‌ఘన్‌పూర్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో వాగ్దానం వినిపించేది. కాజీపేట బాపూజీనగర్ వద్ద డీజిల్ లోకో షెడ్ సమీపంలో దీన్ని ఏర్పాటు చేస్తారని, వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొనేవారు. ఎన్నికల తర్వాత తిరిగి షరా మామూలే. దాన్ని మరచి పోయే వారు. గట్టిగా ప్రయత్నించి పోరాడే నాయకులు లేకపోవడంతో పంజాబ్‌కు తరలి పోయింది. ఇక కొంత కాలంగా మెగా టెక్స్‌టైల్ పార్కు మంజూరవుతుందని అంతా ఆశించారు. ధర్మసాగర్ మండలం దేవునూరు ప్రాంతంలో స్థల సేకరణ కూడ జరిగిందని, పనులు ప్రారంభం అవుతుందని భావించారు. మళ్లీ ఏమైందో తెలియదు, కాని పనులు మాత్రం ఇప్పటివరకు మొదలు కాలేదు.

చిన్న పరిశ్రమలదీ అదే దారి...

పెద్ద పరిశ్రమలు హామీలకే పరిమితమయ్యాయని జనం మొత్తుకుంటుండగా చిన్న పరిశ్రమలదీ అదే తీరు అన్నట్టుగా ఉందని చెబుతున్నారు. శివునిపల్లి శివారు నమిలిగొండ వద్ద లెదర్ పార్కు భవనాన్ని నిర్మించారు. 20 లక్షలతో నిర్మించిన భవనంలో యంత్ర పరికరాలు ఏర్పాటు చేయకుండా 10 ఏళ్ల వృథాగా ఉంచారు. ఆ తర్వాత యంత్రాలు తెచ్చి బిగించినా ప్రారంభం మాత్రం చేయలేదు. శిక్షణ పొందిన నిరుద్యోగ యువత లెదర్ పార్కును 25 ఏళ్లయినా ప్రారంభించక పోవడంతో పనులు లేక వలస బాట పట్టారు.

ఇక శివునిపల్లిలో ఉన్న చేనేత కార్మికుల సముదాయానిదీ అదే పరిస్థితి. 35 ఏళ్ల క్రితం నిర్మించిన చేనేత కాంప్లెక్స్‌లో చేనేత మగ్గాల యూనిట్, కండెల యూనిట్, పట్టు చీరల యూనిట్ ఏర్పాటు చేశారు. పుష్కర కాలం పాటు కాంప్లెక్స్ బాగానే నడిచింది. కార్మికులకు ఉపాధి చూపింది. తర్వాత నిర్వహణా లోపంతో మూతపడింది. దీంతో కార్మికులు సూరత్, భీవండి తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు.

స్టేషన్‌ఘన్‌పూర్ అన్నపూర్ణ రైస్ మిల్లు ఎదురుగా ఉన్న పవర్ లూం కాంప్లెక్స్ కూడా ప్రారంభం కాకుండానే మూతపడింది. చేనేత కార్మికులే చందాలు వేసుకుని స్థలం కొనుగోలు చేసుకుంటే ప్రభుత్వం భవనాన్ని నిర్మించి ఇచ్చింది. దశాబ్దాలు గడుస్తున్నా పవర్ లూమ్స్ మాత్రం ఏర్పాటు చేయక పోవడంతో భవనం అలాగే మిగిలిపోయింది. ప్రారంభించక ముందే శిథిలమవుతోంది.

స్టేషన్‌ఘన్‌పూర్ చెరువు కట్ట వద్ద మినీ బస్ డిపో ఏర్పాటు చేయడానికి సుమారు 25 ఏళ్ల క్రితమే ఆర్టీసీ స్థలం సేకరించింది. హద్దులు కూడా ఏర్పాటు చేసుకుంది. ఐతే ఇంత వరకు తట్టెడు మట్టి కూడా తీయలేదు. మినీ బస్ డిపో ఏర్పాటు చేస్తే ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందని ఆశించిన నిరుద్యోగులకు నిరాశే మిగిలింది. కాగా సేకరించిన స్థలం మాత్రం కొద్దికొద్దిగా అన్యాక్రాంతం అవుతోంది.



వెలవెల బోతున్న చేనేత కార్మికుల కాంప్లెక్స్



వృథాగా ఉన్న పవర్ లూం కాంప్లెక్స్ భవనం



ప్రారంభానికి నోచుకోని లెదర్ పార్క్



మినీ బస్ డిపో కోసం సేకరించి వదిలేసిన స్థలం

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి..

విజయ్ కుమార్, స్థానికుడు



భారీ పరిశ్రమలతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. దీని వల్ల రైతులు, కూలీలు, యువతకు ఉపాధి లభిస్తుంది. ఈ దిశగా పాలకులు దృష్టి సారించాలి.

యువతకు పనులు, ఉద్యోగాలు ఏవి?

చిరంజీవి నాయక్, యువజన నాయకుడు



గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక స్థితిని మెరుగు పరిచే కంపెనీలు ఎందుకు ఏర్పాటు చేయరు? కేవలం పెద్ద పట్టణాలకే వీటిని పరిమితం చేయడం వల్ల ప్రజలు వలస బాట పడుతున్నారు. పనుల కోసం అందరూ పట్టణాలకు చేరడం వల్ల సంపద అక్కడే పెరుగుతున్నది. గ్రామాల్లో ప్రగతి కానరావడ లేదు. చదువుకున్న యువత పనులు, ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అవినీతికి కేరాఫ్ తహసీల్దార్ కార్యాలయం

- గ్రామాల్లో ఏజెంట్ల ద్వారా వసూళ్ల పర్వం
- ప్రక్షాళన చేయాలంటున్న ప్రజలు

బచ్చన్నపేట, మార్చి 24: కొంతమంది అవినీతి అధికారులు, సిబ్బంది మూలంగా బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం పరువు మసకబారుతోంది. గతంలోనే ఇది అవినీతికి కేరాఫ్‌గా మారిందనే ప్రచారం ఉంది. గతంలో ఏసీబీ వలలో డీటీతో పాటు జూనియర్ అసిస్టెంట్ చిక్కుకున్నారు. అయినా తీరుమారని అధికారులు ఎంతో కష్టపడి పనిచేసి పది మందికి అన్నం పెట్టే రైతుల వద్ద కూడా డబ్బుల కోసం కక్కుర్తి పడుతున్నారు. గత ఏడాది అగస్టులో తహసీల్దార్‌గా ఎం.విశాలాక్షి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కొంత పనితనంలో మార్పు వచ్చిందనే ప్రచారం సాగుతున్నా, కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది ఏంచేస్తున్నారో కనిపెట్టలేక పోతున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. ఇటీవలి కాలంలో కార్యాలయంలో లక్షల్లో బేరాలు కుర్చుకుంటున్న విషయం తహసీల్దార్‌కు తెలవకుండా జరుగుతుందా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ధరణిలోని లోపాలను ఆసరాగా చేసుకుని కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రతిరోజు అమాయక రైతులు గగ్గోలు పెడుతున్నారు.

గ్రామాల్లో భూమి సర్వేల సందర్భంగా బయటపడుతున్న లొసుగులను ఆసరాగా చేసుకుని కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులు సిండికేటుగా మారి ఎడపెడా దోచేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. .కనీసం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చే విషయంలో కూడా చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. డబ్బులు అడిగే విషయంలో రైతులు తమ కాల్‌లను రికార్డు చేసి ఎక్కడ బయటపెడుతారోనని, వాట్సాప్ కాల్స్ చేస్తూ బేరాలకు దిగుతున్నారని విద్యావేత్త అయిన ఓరైతు తెలిపాడు. పాత పాస్‌పుస్తకాల్లో భూముల సర్వే నంబర్లతో కూడిన వివరాలు ఉన్నా, కొత్తపాస్ పుస్తకాలు అందని వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పనులు కావటం లేదంటున్నారు. సిండికేటు గ్రూపును ప్రసన్నం చేసుకుంటేనే రికార్డుల సవరణలు సక్రమంగా పూర్తవుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది.

ఇటీవల గంగాపూర్‌కు చెందిన ఓరైతు భూమి విషయంలో రికార్డుల సవరణ కోసం వాట్సాప్ కాల్ చేసి లక్షల్లో డబ్బులు డిమాండ్ చేసినట్టు తెలిసింది. తమ తండ్రి ద్వారా సంక్రమించిన భూములను రికార్డులో నమోదు చేయడానికి డబ్బులు ఎందుకని ప్రశ్నిస్తే ఫోన్ కట్ చేశారని, కార్యాలయానికి వెళితే ఏ సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని రైతు చెబుతున్నాడు. ఈ విషయాన్ని ఇటీవల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెబుతున్నారు. ఇలా మండలంలో అనేక గ్రామాల్లో ఉన్న భూసమస్యల పరిష్కారం పేరుతో లక్షల్లో డిమాండ్ చేయటం సాధారణంగా మారిందంటున్నారు.



బచ్చన్నపేట తహసీల్దార్ కార్యాలయం

పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన రఘుపతి మృతి పట్ల కలెక్టర్ సీరియస్‌గా స్పందిస్తున్నారని తెలిసింది. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల గురించి సమగ్ర సమాచారం తీసుకుంటున్నారని, ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభిస్తారనే చర్చ రెవెన్యూ వర్గాల్లోనే కొనసాగుతోంది. ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సైతం కార్యాలయంలో పనిచేసే అధికారుల వ్యవహార శైలిపై ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదికలు పంపినట్టు తెలిసింది. రఘుపతి వ్యవహారంలో మధ్యవర్తిగా ఎవరు వ్యవహరించారు. రెవెన్యూ అధికారులకు డబ్బులు ఎలా చేరాయనే విషయమై ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. గ్రామాల్లో ఏజంట్లుగా కొంతమంది నమ్మకస్తులను ఏర్పాటు చేసుకుని ఈ తతంగం కొనసాగిస్తున్నట్టు తెలిసింది. కాగా రఘుపతి మృతదేహాన్ని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉంచి ఆందోళన చేసిన రోజు ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులపై ఆరోపణలు చేయగా, అనంతరం జరిగిన పరిణామాలతో ఎఫ్ఐఆర్ ఒకరిపై నమోదైందని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపితే అనేక విషయాలు బయటకు వస్తాయనే ప్రచారం ఉంది. ఏది ఏమైనా రెవెన్యూ కార్యాలయాన్ని ప్రక్షాళన చేసే దిశగా ఉన్నతాధికారులు అడుగులు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రిజర్వాయర్‌లో నీటి నిల్వలను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

నర్మెట, మార్చి 24: మండలంలోని బొమ్మకూరు రిజర్వాయర్‌ను మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం సందర్శించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వలను పరిశీలించారు. మండలంలో పొలాలు ఎండిపోతున్నాయని, రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని సంబంధిత అధికారులతో డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. బొమ్మకూరుతో పాటు వెల్దండ, కన్నెబోయినగూడెం రిజర్వాయర్‌లను నింపి కాలువల ద్వారా రైతులకు నీరు అందించాలన్నారు. అధికారుల వెంటనే స్పందించి నీటిని అందిస్తామని తెలిపారు.

బాలయేసులో మట్టల పండుగ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దేవరుప్పుల, మార్చి 24: మండలకేంద్రంలోని బాలయేసు పాఠశాలలో ఆదివారం మట్టల పండుగ ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు మట్టలు చేతపట్టుకుని పాఠశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం యేసు మందిరంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ పాల్గొన్నారు.

లిటరసీ అవార్డు గ్రహీతకు సన్మానం



బ్రహ్మచారిని సన్మానిస్తున్న స్వర్ణకారులు

బచ్చన్నపేట, మార్చి 24: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉప్పలోజు బ్రహ్మచారిని ఆదివారం స్వర్ణకారుల సంఘం నాయకులు శాలువాలతో సన్మానించారు. ఇటీవల ఆయన ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్, ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ ఆఫ్ తెలుగు లిటరసీ అవార్డును అందుకున్నారు. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పిన బ్రహ్మచారి, తన రచనలతో అనేక మందిని ప్రభావితం చేయగలిగారని వారు కొనియాడారు. కార్యక్రమంలో వెల్దుర్తి శ్రీనివాస్, మేడోజు యాదగిరి, సాంబయాచారి, భాస్కరాచారి, కృష్ణమూర్తి, ధర్మాచారి, శ్రవణ్‌కుమార్, భాస్కర్, ప్రశాంత్, శ్రీకాంత్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా చక్రస్నానం

చిలుపూర్, మార్చి 24 : చిలుపూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చివరి రోజు ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామివారికి హోమపూజతో పాటు, చక్రస్నానం, పుష్పయాగం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల మధ్య హోమం, బలిహరణం, మహాపూర్ణాహుతి పూజలను నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల ప్రతిమలకు చక్రస్నానం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, ఈవో లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ 8 రోజుల పాటు, నిర్వహించిన స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మూల నాగరాజు, ధర్మకర్తలు సంగోజు మోహనాచారిశంకరలక్ష్మి, గట్టు ఎల్లయ్య, గాజుల రజిని, జక్కుల రాజశేఖర్, మేకల మల్లేషం, నారాయణరెడ్డి, పుట్ట కిరన్‌రెడ్డి ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తిది తొందరపాటు నిర్ణయం


కాంగ్రెస్‌పార్టీ చేరికల ఇన్‌చార్జి కాకిరాల హరిప్రసాద్

దేవరుప్పుల, మార్చి 24: కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగిన పెద్ది కృష్ణమూర్తి తొలగింపు అధిష్టాన నిర్ణయమని, ఆయనే తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నాడని కాంగ్రెస్ పార్టీ చేరికల ఇన్‌చార్జి కాకిరాల హరిప్రసాద్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణమూర్తికి గ్రామశాఖల అధ్యక్షుల సహకారం లేకపోవటంతో అధిష్టానం ఆయనను తప్పించి నల్ల శ్రీరామ్‌ను నియమించిందన్నారు. అయన పార్టీలో అందరినీ కలుపుకోవటం లేదని వారి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకే తొలగించినట్టు తేల్చి చెప్పారు. ఆయన పద్ధతి మార్చుకోవాలని పాలకుర్తి ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి నాలుగుసార్లు హెచ్చరించినా కూడా ఆయన వినలేదన్నారు. జిల్లా స్థాయిలో సముచిత స్థానం కల్పిస్తానని చెప్పినా వినకుండా ధర్నాలు చేయించాడన్నారు. చివరకు గాంధీభవన్ వద్ద కూడా ధర్నా చేశాడన్నారు. ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా పాల్పడితే వేటు తప్పదని హెచ్చరించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రాపాక సత్యనారాయణ, నల్ల శ్రీరామ్, ఉప్పుల సురేష్‌బాబు, కాడబోయిన గణేష్, తోటకూరి పాండు కృష్ణ, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

సాగునీరందక ఎండుతున్న పొలాలు



వరి చేనులో గేదెలు మేపుతున్న రైతు తోట రవి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 24: మండలంలో సాగునీరందక పొలాలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో విధిలేని పరిస్థితిలో రైతులు తమ పొలాల్లో పశువులను మేపుతున్నారు. శివునిపల్లి గ్రామానికి చెందిన తోట రవి అనే రైతు ఐదెకరాల వరిచేను సాగు చేస్తే నీరు లేకపోవడంతో ఆదివారం గేదెలను మేపాడు. సుమారు రూ.1లక్ష మేర ఖర్చు చేసి ఐదెకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశానని తెలిపారు. రెండు బోరు బావుల కింద వరిసాగు చేయగా రెండూ ఎత్తిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత యాసంగిలో శివునిపల్లి చెరువును దేవాదుల నీళ్లతో నింపడంతో చెరువు కింద ఉన్న తన బోరుబావుల్లో సమృద్ధిగా నీరు అందిందని అన్నారు. ప్రస్తుతం శివునిపల్లి చెరువు పూర్తిగా ఎండిపోవడంతో బోర్లలో నీళ్లు లేక ఐదెకరాల వరి పూర్తిగా ఎండిపోయిందని వాపోయాడు. ప్రభుత్వం పంటనష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

దుర్గామాత ఉత్సవాలు

అక్టోబరు నెలకు వాయిదా

జనగామ కల్చరల్, మార్చి 24: వచ్చే నెలలో జనగామలో నిర్వహించ దలచిన దుర్గామాత ఉత్సవాలు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం బతుకమ్మ కుంట విజయదుర్గామాత దేవాలయంలో అన్ని కుల, సామాజిక వర్గాల పెద్దల సమావేశంలో ప్రముఖ సిద్ధాంతి కృష్ణమాచార్యుల సూచనలతో ఉత్సవాలను వాయిదా వేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయం ఆలయ సాంప్రదాయానికి విరుద్ధంగా ఉందని, అందువల్లనే పట్టణ ప్రజలు, ప్రధానంగా నిర్వాహకులు కష్టాల పాలయ్యారని భావించి శివాలయాన్ని ప్రస్తుతం ఉన్న స్థలం నుంచి ఎల్లమ్మ దేవాలయం పక్కనే వాయువ్యంలో నిర్మించాలని తెలిపారు. విగ్రహ పునఃప్రతిష్ఠకు సమయం పడుతున్నందున ఉత్సవాలు అక్టోబరు నెలకు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆలయ పూజారి రాజలింగ ఆరాధ్య, కమిటీ అధ్యక్షుడు పిట్టల సత్యం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్రె శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ పోకల జమున, కౌన్సిలర్ వాంకుడోతు అనిత తదితరులు పాల్గొన్నారు.

'అరూరి'కే ఖరారు

(5వ పేజీ తరువాయి)

ఆరూరి రమేష్ పేరును అధిష్ఠానం ఖరారు చేయటంతో బీజేపీలో సంబరాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా...

కాంట్రాక్టర్‌గా ఉన్న ఆరూరి రమేష్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రెండోసారి 2018లో కూడా భారీ మెజారిటీతో వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా అరూరి రమేష్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. అయితే 2023 ఎన్నికల్లో అరూరి రమేష్ ఓడిపోయారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ ఆశించిన అరూరికి అధిష్ఠానం నిరాశ మిగిల్చింది. దీనికి తోడు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అరూరి గమనించారు. ఈ క్రమంలో బీజేపీ నుంచి ఆఫర్ రాగానే పార్టీ మారారు. బీజేపీ అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగుతున్నారు.

రఘుపతి కుటుంబానికి న్యాయం చేయాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, మార్చి 24: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన కొమ్మాట రఘుపతి కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల వల్లే రఘుపతి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడం మాని, గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయటం సరికాదని అన్నారు. పేద రైతుల సమస్యలు పరిష్కరిస్తామని రోజుకో స్టేట్‌మెంట్ ఇవ్వటం మినహా, ప్రస్తుత ప్రభుత్వం చేసిందేమిలేదన్నారు. రూ. 6 లక్షలు తీసుకుని, ఇంకా కావాలని రైతును వేధింపులకు గురిచేసిన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. రైతు పేరిట పట్టా చేయడంతో పాటు, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోతే రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి 95 శాతం మేర రైతాంగానికి ఉపయోగపడేలా చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, మునిని రాజుగౌడ్, బాలమల్లు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎమ్మెల్యే పల్లా